క్లుప్తంగా

నేతాజీ త్యాగాలను మరువరాదు



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: దేశం కోసం నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ చేసిన త్యాగాలను మరిచిపోవద్దని, ఆయన స్ఫూర్తితో అందరూ ముందుకెళ్లాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్ అన్నారు. సోమవారం పాణ్యం డిగ్రీ కళాశాలో నేతాజీ 80వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ప్రతి విద్యార్థి నేతాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నందికోళ్ల ఉత్సవం



నందికోళ్ల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కల్లూరు: కల్లూరులో వెలసిన శ్రీ ఈశ్వర వీర భద్రస్వామి దేవస్థానంలో శ్రావణమాస ఆఖరి సోమవారం నందికొళ్ల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంచామృతాభిషేకం, గంగా స్నానం, మహా నైవేద్యం, మహా మంగళ హారతి అనంతరం భక్తులకు వీర శైవ లింగాయతి సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం నంది కోళ్ల విన్యాసంతో ఖడ్గ పద్యాలతో గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.గురెడ్డి, వీరశైవ లింగాయతి సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, సభ్యులు పెద్ద లక్ష్మయ్య, మల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు: విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థి (నగరి డీఎస్పీ) ఎస్ఎండీ అజీజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



ఎస్సీకాలనీలో ఇళ్లముందే పందుల సంచారం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నెదెవరపాడు గ్రామంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్ల మధ్య గుంపులు గుంపులుగా తిరుగుతూ పరిసరాలను కలుషితం చేస్తున్నాయి. దీనికితోడు వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో వైరల్ వ్యాధులు వ్యాప్తించే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

హాస్టల్‌ను సందర్శించిన డీవీఎంసీ సభ్యులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవీఎంసీ సభ్యులు

ఓర్వకల్లు : స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు గొందిపల్లె మాలతి, ఉల్చాల మద్దిలేటి సోమవారం సాయంత్రం సందర్శించారు. హాస్టల్‌లో ఆదివారం రాత్రి ఫుడ్‌పాయిజన్‌తో ఆరు మంది విద్యార్థులు అస్వస్థకు గురైన నేపథ్యంను పరిశీలించి, బాధిత విద్యార్థులను పరామర్శించారు. హాస్టల్‌లో సదుపాయాలు, సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ...హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలో వార్డెన్ సుంకన్న నిర్లక్ష్యమే కారణమని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లుతామని తెలిపారు. ర్యక్రమంలో లంబాడీ సంఘం నాయకులు యోగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నటేకూరు వద్ద ఉల్లి పంటలో నిలిచిన వర్షపు నీరు



తడకనపల్లె రోడ్డులో రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీరు



కంబదహాల్ గ్రామంలో పత్తి పంటలో నిలిచిపోయిన వర్షపునీరు



గడివేములలో జలమయమైన మొక్కజొన్న పైరు

వదలని వాన

- పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- కుళ్లుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- పొంగిపొర్లుతున్న వాగులు
- నిలిచిన రాకపోకలు



బలపనూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

కల్లూరు: రెండు వారాల నుంచి వర్షం కురుస్తునే ఉంది. దీంతో గ్రామాల్లోని రోడ్లన్నీ బురదమయంగా మారాయి. బురద, మట్టి రోడ్లపై భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. పత్తి, ఉల్లి, మొక్కజొన్న, ఆముదం, కంది తదితర పొలాల్లో వర్షం నీరు నిలిచింది. ఆదివారం రాత్రి నుంచి మండల వ్యాప్తంగా 39.8 మి. మీ వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాల వల్ల చిన్నటేకూరు బస్తిపాడు గ్రామాల మధ్య సాగు చేసిన పత్తి మొక్కలు నీటి ఉధృతికి కొన్ని కింద పడపోగా, కొన్ని మొక్కలు కొట్టుకొని పోయాయి. చిన్నటేకూరు వద్ద ఉల్లి పంటలో నీరు నిలిచింది. పంట పొలాల్లో తేమ ఆరడం లేదని రైతులు వాపోతున్నారు. సాగు చేసిన పంటలన్నీ తేమశాతం అధికం అవ్వడం వల్ల నీటి కుళ్లు తెగులు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడకనపల్లె రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు నిలవడంతో కొన్ని గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం కర్నూలు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు, తడనపల్లె రోడ్డులో ఉన్న ప్రైవేటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

ఉధృతంగా వాగులు..

పాణ్యం : ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే చిన్న పాటి వాగులు వంతెలనుపైకి ఎక్కి ప్రవహిస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా రాయపాడు-గగ్గటూరు వద్ద ఊరు ముందరి వాగుపై భారీగా నీరు చేరడంతో రాకపోకలు నిలచిపోయాయి. దీంతో గ్రామస్తులు కొత్తూరు, మద్దూరు మీదుగా నంద్యాలకు వెళ్తున్నారు. అలాగే బలపనూరు గ్రామం వద్ద ప్రవహించే కానుగల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వాగు అవతల ఉన్న పొలాలకు చేరుకోవాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైవే మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నారు. భూపనపాడు-కొలురు గ్రామాల మధ్య ఉన్న వొద్దెల వాగుకు భారీగా వరద నీరు ప్రవహిస్తుంది. అహల్యాపురం గ్రామం వద్ద కొర్రవాగు దాటేందుకు వీలు లేకుండా ప్రవహిస్తోంది.

అన్నదాతకు నష్టం..

గడివేముల: గత వారం రోజుల నుంచి వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. మండలంలో మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, మినుము పంటలు అధికంగా సాగు చేశారు.అలాగే మిరప పంటను నాటుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజన్‌లో సాగు చేసిన పంటల్లో కలుపులు తీసుకునేందుకు వీలు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు రైతు సేవాకేంద్రాల్లో యూరియా అరకొరగా అందుబాటులో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

సి.బెళగల్: మండలంలో ఆదివారం రాత్రి నుంచి మొదలైన వర్షం సోమవారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా కురవడంతో రైతులు, ప్రజలు అవస్థలు పడ్డారు. మండల వ్యాప్తంగా 36.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు మండల గణాంకాధికారి ఆదినారాయణ తెలిపారు. కాగా గత వారం రోజులుగా విరామం లేకుండా ప్రతిరోజు వర్షాలు కురవడంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం సైతం మరోమారు మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు పోలకల్, గుండ్రేవుల, ఇనగండ్ల, కొండాపురం, పలుకుదొడ్డి తదితర గ్రామాల్లో మంచి వర్షం కురిసింది. దీనితో పొలాల్లో నుంచి వర్షపునీరు భారీ ఎత్తున వంకలలోకి వచ్చి చేరింది. బురాన్‌దొడ్డి గ్రామం దగ్గర వంక ఉధృతంగా ప్రవహించడంతో పెద్దనేలటూరు వెళ్లే దారిలో ప్రయాణాలు నిలిచిపోయాయి. అదేవిధంగా ఆయా గ్రామాల్లో పత్తి, ఉల్లి, మిరప, కొర్ర పంటలు వర్షపునీటిలో మునిగాయి. ఇదిలా ఉండగా తుంగభద్ర నదిలోని వరదనీటి ప్రవాహం పెరగడంతో నదితీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు.

ఉల్లి రైతు ఆశలపై నీళ్లు



పడిదెంపాడులో ఉల్లి పొలంలో నిలిచిన వర్షపు నీరు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు, పసుపుల, పి. రుద్రవరం, నందనపల్లె, సూదిరెడ్డి పల్లె తదితర గ్రామాల్లో ఉల్లి పంటను వందలాది ఎకారాల్లో సాగు చేశారు. పది రోజులుగా వర్షాలు పడుతుండటం, ముసురుతో ఉల్లి సాగు చేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. 10రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పంటలు బాగుంటాయనుకున్న తరుణంలో వీడని వర్షాలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు పొలాల్లో వర్షపు నీరు నిలిచి ఉల్లి పంట దెబ్బతిన్నాయి.



వర్షం నీటి ఉధృతికి కొట్టుకు పోయిన పత్తి మొక్కలు



బురాన్‌దొడ్డి దగ్గర ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దనేలటూరు వంక

అలా వచ్చి.. ఇలా వెళ్లారు!



తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరైన అధికారులు

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారిక వేదిక కార్యక్రమానికి గడివేముల మండలస్థాయి అధికారులు హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఉపన్యాసం అయిపోయిన తరువాత మండల స్థాయి అధికారులు వెళ్లిపోయారు. ఉదయం 12 గంటల సమయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో తహసీల్దార్, ఎలక్ట్రికల్, మండల సర్వేయర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ తప్ప ఎవరూ కనిపించలేదు. దీంతో సమస్యలను వివరించేందుకు వచ్చిన ప్రజలు వెనుతిరుగారు. ప్రతి సోమవారం అధికారులది ఇదేతంతు నడుస్తోందని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సి.బెళగల్లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్)కు మండల ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. సోమవారం మండల అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పీజీఆర్ఎస్‌ను నిర్వహించగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ తదితరులు హాజరయ్యారు. సి.బెళగల్‌కు చెందిన స్వచ్ఛ భారత్ కార్మికులు తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓను కలిసి కోరారు. అదేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రెవెన్యూ అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ నిర్వహించగా పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం తదితరులు ఉన్నారు.

మేమేమి చేశాము నేరం



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

కోడుమూరు రూరల్: అన్ని రకాల అర్హతలున్నా వైకల్య ధ్రువీకరణ పర్సంటేజి తక్కువ ఉందని పింఛన్ల తొలగింపునకు నోటీసులివ్వడంపై దివ్యాంగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేమేమి చేశాం నేరం అంటూ సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు. ×40శాతం వికలాంగత్వం లేదంటూ మండలంలో 300మందికి పైగా దివ్యాంగులకు నోటీసులు జారీ చేశారు. కొందరు పింఛన్లు నిలుపుదల కూడా చేశారు. ఇలా చేయడం అన్యాయం. దీనిపై సర్కారు పునరాలోచన చేసి తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కోడుమూరుకు చెందిన 20మంది వికలాంగులు ఎంపీడీఓ రాముడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో దివ్యాంగులు పెద్ద గిడ్డయ్య, మాదన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిలాటెలీ స్కాలర్‌షిప్ పరీక్ష

కర్నూలు (అర్బన్): విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఎన్నో రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' (డీడీఎస్‌వై) అనే స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్ధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు మెమోలు

కర్నూలు (టౌన్): విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన నగరపాలక రెవెన్యూ ఉద్యోగులకు కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం మెమోలు జారీ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఖాళీగా ఉన్న, పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ షాపులు, జొహరాపురం వద్ద ఉన్న షటిల్ కోర్టు, ఇండోర్ స్టేడియం తదితర వాటికి వేలాలు నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా నగరపాలక రెవెన్యూ విభాగానికి ఆదాయం సమకూరుతుంది. అలాగే రెవెన్యూ విభాగంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ ప్రతిసారి వేలాల గురించి కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రెవెన్యూ ఉద్యోగులు స్పందించలేదు. దీంతో ఈ విభాగం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ రెవెన్యూ అధికారి కేఎం డీ.జునీద్, సూపరింటెండెంట్ టి.అబ్దుల్ వాజీద్, జీ.సుహేయిల్ అహమ్మద్ (సీనియర్ అసిస్టెంట్, ఏ1) లకు మెమోలు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో వేలాలకు సంబంధించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. సకాలంలో వేలాలు నిర్వహించకపోవడం వల్ల నగరపాలక సంస్థకు నష్టం వాటిల్లిందని, దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆదాయాన్ని నష్టపరిచినందుకు ఏపీసీఎస్ యాక్ట్ 1991 ప్రకారం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్‌కు దుమ్మా కొట్టిన అధికారులకు నోటీసులు?

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సెక్షన్ హెడ్‌లు దుమ్మా కొట్టడంపై కమిషనర్ పి.విశ్వనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెక్షన్ హెడ్‌లు సెలవు పెట్టినా తనకు తెలియజేయకపోవడంపై మండిపడ్డారు. చెప్పకుండా సెలవుల్లో పోవడం, కింది స్థాయి ఉద్యోగులను పంపించడమేంటని విస్తుపోయారు. కాగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, సిటీ ప్లానర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాలేదు. వారిరువురు సెలవు పెట్టినట్లు తెలుసుకున్న కమిషనర్ తనకు తెలియకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

మెనూ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు : హాస్టళ్లలో మెనూ పాటించని అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహబూబ్‌బాషా తదితరులు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. స్థానిక ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో 120 మంది విద్యార్థులు ఉండగా, రెగ్యులర్ వార్డెన్‌ను నియమించకపోవడం సంక్షేమ శాఖ అధికారులకు సిగ్గుచేటని విమర్శించారు. చాలా రోజుల నుంచి మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నట్లు తెలిపారు. నాణ్యతలేని కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసిన భోజనం పెడుతుండటంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. మనుషిపై చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్‌కు వినతి పత్రం సమర్పించారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్



రాజేష్‌కుమార్

సి.బెళగల్: పీఆర్‌టీయూ సి.బెళగల్ మండల శాఖ అధ్యక్షుడిగా రాజేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుగ్గన తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం కర్నూలులో ఉన్న పీఆర్‌టీయూ కార్యాలయంలో మండల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఇందులో కె.సింగవరం జిల్లా ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజేష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం అనంతరం రాజేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మండల ప్రధాన కార్యదర్శిగా సురేష్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుగ్గన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలి



ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పంట పొలాల్లో నీరు నిలువ ఉండకుండా రైతులు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి సూచించారు. సోమవారం ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి మండలంలోని బస్తిపాడు, చిన్నటేకూరు, బొల్లవరం గ్రామాల్లో పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. పొలాల్లో నీరు తొలగించడంతో పాటు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు/10 గ్రాముల యూరియాను ఒక లీటర్ నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. 13-0-45 ఎకరాకు కేజీ చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్‌కి కలుపుకొని పిచికారీ చేయడం వల్ల వేరు కుళ్లు తెగులు నివారించవచ్చు. కాయ కుళ్లు నివారణకు ఒక లీటర్ నీటికి 100ఎం.ఎల్ స్ట్రెప్టోసైక్లీన్‌తో పాటు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఉల్లిలో అధిక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఉల్లిలో కుళ్లు తెగులు ఆశించినప్పుడు కార్బండిజంతో పాటు మాంకోజెబ్ ఒక కేజీ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి



కోడుమూరులో ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శేషుకుమార్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం కోడుమూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషుకుమార్ మాట్లాడుతూ అమెరికా విధించే టారిఫ్‌లపై కేంద్ర ప్రభుత్వం నోరు మెదపకుండా రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలకు కేంద్రం అనుమతించడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో పునరాలోచన చేయాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రైతులు పండించే పంట పొలాలు ఇవ్వరాదని, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు రాముడు, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి చిన్న రాముడు, రైతు, హమాలీ సంఘం నాయకులు విశ్వనాథ్, మునిస్వామి, గోవిందు, మద్ది, చిన్న బజారి, దాము, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ పద్ధతిని తెలియజేస్తున్న వైద్యులు

కర్నూలు(రూరల్): సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) విధానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మెడింపాక్ట్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు రజనీ, మణిదిప్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని మైపర్ కాలేజీ ఆడిటోరియంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సీపీఆర్ చేయడం ద్వారా కార్డియాక్ సమస్యలతో వచ్చే మరణాలను అదుపు చేయవచ్చన్నారు. సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుందని, నోటి ద్వారా ఆక్సిజన్ అందించి ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఎవరైనా ప్రాణపాయ పరిస్థితుల్లో ఉంటే స్పదించి ప్రథమ చికిత్స అందించే నైపుణ్యాలను యువతలో పెంపొందించేందుకు ఈకార్యక్రమం చేపట్టామన్నారు.

3.32 లక్షల హెక్టార్లలో పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి సాగు భారీగా పెరిగింది. ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటివరకు 3,32,722 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2,34,409 హెక్టార్లు ఉండగా ఇప్పటివరకు 2,14,378 హెక్టార్లలో సాగైంది. మిగతా అన్ని పంటలు కలిపి 1,18,344 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి.

నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు



కొత్త జి. సింగవరం గ్రామం వెళ్లే ప్రధాన దారిలో వాలిన విద్యుత్ స్తంభాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని జి. సింగవరం గ్రామ సమీపంలో కేసీ కెనాల్ వంతెన దగ్గర కొత్త జి.సింగవరం గ్రామానికి వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఈదురుగాలులకు స్తంభాలు నేలకొరిగిపోతుండటంతో అవి ఎప్పుడు కిందకు పడతాయోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.